ప్రగతి బాట

- 86వ వార్డులో అద్దంలా మెరుస్తున్న రహదారులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు



కూర్మన్నపాలెం: గతంలో శివారు ప్రాంతాల్లో ప్రయాణమంటేనే హడలిపోయే పరిస్థితి. రోడ్లు గతుకులమయమై ప్రయాణికులు ఇబ్బంది పడేవారు. ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారింది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత నగరంలో ప్రతీ వార్డుతో పాటు శివారు ప్రాంతాల్లోనూ అంతర్గత రహదారులు అద్దంలా మెరుస్తూ ఉండడంతో ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడ చూసినా సిమెంట్, తారు రోడ్లు అందంగా అద్దంలా దర్శనమిస్తున్నాయి. దీంతో ఎలాంటి అంతరాయం లేకుండా రోడ్లపై ప్రజలు, వాహనచోదకులు ప్రయాణం సాగిస్తున్నారు. ముఖ్యంగా జీవీఎంసీ 86వ వార్డులో రోడ్లు అధ్వానంగా ఉండేవి. ఈ విషయాన్ని స్థానికులు ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా, వెంటనే స్పందించి అధికారులతో ప్రణాళికలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదిక అందజేశారు. దీనికి స్పందించిన రాష్ట్ర ప్రభుత్వం నిధులు మంజూరు చేయడంతో బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలను త్వరితగతిన నిర్మించారు. దీంతో గ్రామస్తులు రహదారి సమస్యలకు తెర పడిందంటూ, ప్రభుత్వ పనితీరుపై హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సాయిబాలాజీ నగర్‌లో..

సాయిబాలాజీనగర్ లేఔట్ నుంచి వుడా గ్రీన్ అపార్ట్‌మెంట్ వరకు 70 ప్లాట్లలో ఉన్న ప్రజల సౌకర్యార్థం 36 లక్షలతో 800 మీటర్లు మేర రోడ్డు నిర్మించారు. అదే విధంగా వార్డులోని పలు ప్రాంతాల్లో రోడ్లకు మరమ్మతులు చేపట్టడంతో పాటు డ్రెయిన్లు, కల్వర్టులు నిర్మించడంతో భవిష్యత్తులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తవని ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఫకీర్‌తక్యా - వీపీఎస్ సెంటర్

నిధులు : రూ.19.9 లక్షలు



జీవీఎంసీ 86వ వార్డు పరిధి ఫకీర్‌టకియా నుంచి ఎస్‌వీఎస్ సెంటర్ వరకు 19.90 లక్షల రూపాయలతో 400 మీటర్లు రోడ్డు నిర్మించారు. ఎస్‌వీఎస్ సెంటర్ నుంచి షకీలా సెంటర్ వరకు వరకు 18 లక్షల రూపాయలతో ప్యాచ్ వర్కులు చేశారు.

రాసాలమ్మ కాలనీ - రాజీవ్ నగర్

నిధులు : రూ.18 లక్షలు



రాసాలమ్మ కాలనీ రాజీవ్ నగర్ మధ్య 18 లక్షల రూపాయలతో 400 మీటర్ల మేర రోడ్డు నిర్మించారు.

వుడా గ్రీన్ అపార్ట్‌మెంట్ - యాతపాలెం బ్రిడ్జి

నిధులు : రూ.36 లక్షలు

రాసాలమ్మ కాలనీ డాక్‌యార్డ్ సచివాలయం మీదుగా రూ.19 లక్షలతో.. వినాయక టెంపుల్ నుంచి చిన్నయాతపాలెం బ్రిడ్జి వరకు 15 లక్షలతో .. వుడా గ్రీన్ అపార్ట్‌మెంట్ నుంచి యాత పాలెం బ్రిడ్జికి రూ.36 లక్షలతో రోడ్డు నిర్మించారు.



రాసాలమ్మ నుంచి డాక్‌యార్డ్ సచివాలయం మీదుగా నిర్మించిన రోడ్డు

రాజీవ్‌నగర్ - వుడా ఫేజ్.3

నిధులు : రూ.30 లక్షలు



మాతృశ్రీనగర్ లేఔట్ నుంచి రాజీవ్‌నగర్‌కు వెళ్లే ప్రధాన రహదారి వరకు 19.90 లక్షలతో 400 మీటర్ల రహదారి నిర్మించారు. రాజీవ్‌నగర్ రోడ్డు నుంచి వుడా ఫేజ్-3 వరకు సుమారు 30 లక్షల రూపాయలతో 800 మీటర్ల రోడ్డు నిర్మించారు.

సైమన్ నగర్‌లో..

నిధులు : రూ.16.6 లక్షలు



సైమన్ నగర్‌లో నిర్మిస్తున్న రోడ్డు

సైమన్‌నగర్‌లో 16.60 లక్షల ప్రభుత్వ నిధులతో ఓపన్ గ్రీన్ అపార్ట్‌మెంట్ వరకు 600 మీటర్ల వరకు రోడ్డు నిర్మించారు.

రికార్డు స్థాయిలో రోడ్ల నిర్మాణం



ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం కల్పించడానికి రికార్డు స్థాయిలో రహదారులను పూర్తి చేశారు. గతంలో రోడ్లపై ప్రయాణించాలంటేనే ఇబ్బంది పడేవాళ్లం. ప్రస్తుతం గుంతలు పూడ్చడంతో పాటు యుద్ధప్రాతిపదికన నూతనంగా రోడ్లు నిర్మించడంతో అనుకున్న సమయానికే గమ్యం చేరుకుంటున్నాం.

– సోమేశ్వరరావు, కూర్మన్నపాలెం


ఇబ్బందులు తప్పాయి



నేను యాదవ జగ్గరాజుపేటలో నివాసముంటున్నాను. రోజూ వీఎస్‌ఈజెడ్‌లో ఉద్యోగం నిమిత్తం ప్రయాణిస్తున్నప్పుడు రోడ్లు బాగాలేక నిత్యం ఇబ్బందులు ఎదుర్కొనేవాడిని. గతంలో రోడ్డుపై ప్రయాణించేప్పుడు నడుము నొప్పి, ఇతర ఆరోగ్య సమస్యలతో బాధపడేవాడిని. ప్రసుత్తం ప్రభుత్వం చొరవతో కోట్ల రూపాయలతో రోడ్లు నిర్మించడంతో ఇబ్బందులు తొలగాయి.

–జి.శ్రీనివాసరావు, యాదవజగ్గరాజుపేట

రోడ్ల సమస్య తీరింది



మా వార్డులో రోడ్లు సమస్య తీరింది. గతంలో శిథిలమైన రోడ్లపై ప్రయాణించాలంటేనే భయమేసేది. రాత్రి వేళల్లో ప్రయాణం చేయలేక వాయిదా వేసుకునే వాళ్లం. వర్షం పడితే గుంతల్లో నీరు నిల్వ ఉండిపోయేది. ఏది గుంత, ఏది రోడ్డు తెలియక ప్రమాదాలు కూడా జరిగేవి. ఇప్పుడు మా సమస్యకు శాశ్వత పరిష్కారం లభించింది. రోడ్లు, డ్రైనేజీలు నిర్మించడంతో రాకపోకలకు ఇబ్బందులు తొలగాయి.

– మానాపురం శ్రీనివాస పట్నాయక్, కూర్మన్నపాలెం

క్లుప్తంగా

మహిళలకు చీరల పంపిణీ



మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న కరణంరెడ్డి

పెదగంట్యాడ: మత్స్యకార దినోత్సవం సందర్భంగా గంగవరంలో బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు పేద మహిళలకు మంగళవారం చీరలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన అగ్నిప్రమాదంలో మత్స్యకారుల బోట్లు దగ్ధం కావడం బాధాకరమన్నారు. ఏటా గంగవరం గ్రామంలో మత్స్యకారుల దినోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. కార్యక్రమంలో గరికిన పైడిరాజు, పేర్ల అప్పారావు, గరికిన మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో క్రీడాకారిణికి అభినందన

అక్కిరెడ్డిపాలెం: ఈ నెల 18 నుంచి 20వ తేదీ వరకు కాకినాడలో జరిగిన రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 విభాగం ఖోఖో పోటీల్లో అక్కిరెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థిని హేమలత పాల్గొంది. ఆమెను హెచ్‌ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, పీటీ మహ్మద్ ఇస్మాయిల్, ఉపాధ్యాయులు అభినందించారు.

బట్టు సన్యాసిరావు సేవలు మరువలేం



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి

పెదగంట్యాడ: దేవాడ సర్పంచ్‌గా, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షునిగా బట్టు సన్యాసిరావు అందించిన సేవలు ఎన్నటికీ మరువలేమని 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి అన్నారు. బట్టు సన్యాసిరావు వర్ధంతిని పురస్కరించుకుని వార్డు పరిధిలోని పిట్టవానిపాలెంలో నిర్వహించిన కార్యక్రమంలో సన్యాసిరావు చిత్రపటానికి ఆయన సతీమణి సూర్యకుమారి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం 100 మంది మహిళలు, పారిశుధ్య సిబ్బందికి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, బీఎస్సార్ అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

యుద్ధ ప్రాతిపదికన కల్వర్టు నిర్మాణం



కల్వర్టు నిర్మిస్తున్న కార్మికులు

అక్కిరెడ్డిపాలెం: కొద్ది రోజుల క్రితం అక్కిరెడ్డిపాలెం ప్రధాన రహదారి మలుపు వద్ద కల్వర్టు మధ్య భారీగా గొయ్యి ఏర్పడింది. పలువురు వాహనచోదకులు ప్రమాదాల బారిన పడుతుండటంతో, గ్రామస్తులు సమస్యను కార్పొరేటర్ అనూషకు వివరించారు. వెంటనే స్పందించిన అనూష, వైఎస్సార్ సీపీ వార్డు ఇన్‌చార్జి గుడివాడ లతీష్ సమస్యను జీవీఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే పనులు చేపట్టాలని కోరారు. దీంతో మంగళవారం యుద్ధప్రాతిపదికన కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టారు.

సంక్షేమ సారథి సీఎం జగన్

పెదగంట్యాడ: అర్హులందరికీ సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ సారథిగా నిలిచారని ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. ఈ సంక్షేమ పాలన కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారని, అందుకే ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా వైఎస్సార్ సీపీ 76వ వార్డు అధ్యక్షుడు దొడ్డి రమణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొని, పార్టీ జెండాను ఆవిష్కరించారు. నాలుగున్నరేళ్ల వైఎస్సార్ సీపీ పాలనలో చేపట్టిన సంక్షేమ పథకాలను తెలియజేసేలా డిజిటల్ బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో పరంకుశం ప్రమీల, నర్సింహమూర్తి, సూర్యనారాయణ, కాకినాడ పెంటారావు, గొంప రమేష్, భవానీ తదితరులు పాల్గొన్నారు.

73వ వార్డు వినాయకనగర్‌లో..

జీవీఎంసీ 73వ వార్డు వినాయకనగర్ సీడబ్ల్యూసీ బిల్డింగ్ సచివాలయంలో కార్పొరేటర్ భూపతిరాజు సుజాత ఆధ్వర్యంలో 'ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే నాగిరెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు. సచివాలయం వద్ద సంక్షేమ పథకాలను తెలియజేసే డిజిటల్ బోర్డును ప్రారంభించారు. కార్యక్రమంలో గొరుసు సత్యం, ఎం.సత్యనారాయణ, పి.రాము, మోహన్‌రావు, రాజా, కిరణ్, కుమార్ పాల్గొన్నారు.



వినాయకనగర్ సీడబ్ల్యూసీ బిల్డింగ్ సచివాలయం వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి



75వ వార్డు పాత అయ్యన్నపాలెంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న పార్టీ నాయకులు

75వ వార్డు పాత అయ్యన్నపాలెంలో..

ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే కార్యక్రమంలో భాగంగా 75వ వార్డు పాత అయ్యన్నపాలెంలో మంగళవారం ఇంటింటి ప్రచారం చేపట్టారు. పార్టీ మండల అధ్యక్షుడు ధర్మాల శ్రీను ఆధ్వర్యంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు కొయ్యభారతి, మహేశ్వరరెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి వెంకటరమణారెడ్డి తదితరులు ఇంటింటికీ వెళ్లారు. వైఎస్సార్ సీపీ పాలనలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. పార్టీ సంక్షేమ పథకాలను వివరించే బుక్‌లెట్లు, కరపత్రాలను పంపిణీ చేశారు.

ప్రైవేటీకరణతో రిజర్వేషన్లకు ముప్పు

అన్ని వర్గాలను ఐక్యం చేసేందుకు 23న సదస్సు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ జరిగితే ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్ వర్గాలకు తీవ్ర నష్టం జరుగుతుందని స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య అన్నారు. రిజర్వేషన్ వర్గాలను ఐక్యం చేసేందుకు ఈ నెల 23న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, ఓబీసీ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఎల్‌డీసీ ఆడిటోరియంలో సదస్సు ఏర్పాటు చేశామని ఆయన తెలిపారు. ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రెండో పంచవర్ష ప్రణాళికలో పారిశ్రామికాభివృద్ధిలో భాగంగా ప్రభుత్వరంగ సంస్థలు ఏర్పాటయ్యాయని, వాటిని నేటి కేంద్ర ప్రభుత్వం నాశనం చేయాలని చూస్తోందన్నారు. అధ్యక్షుడు బి.తౌడన్న మాట్లాడుతూ 'ప్రభుత్వ రంగం రిజర్వేషన్లు ' అంశంపై సదస్సు నిర్వహించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా తీర్మానం చేయనున్నామని చెప్పారు.సదస్సుకు రాష్ట్ర హోంమంత్రి తానేటి వనిత, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, మాజీ ఎంపీ మిడియం బాబూరావు, ఓబీసీ నాయకులు ఆళ్ల వెంకటేశ్వరరావు తదితరులు హాజరవుతున్నారన్నారు. ఓబీసీ సంఘం అధ్యక్షుడు బి.అప్పారావు మాట్లాడుతూ ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు ఉండాలన్న దేశవ్యాప్త డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు ఉండవల్లి శ్రీనివాస్, సన్నిబాబు, కామేశ్వరరావు, డి.పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.



ఐక్యత చాటుతున్న స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ సంఘాల నాయకులు

వ్యక్తిత్వ వికాసానికి గ్రంథాలయాలు దోహదం

అగనంపూడి: వ్యక్తిత్వ వికాసం పెంపొందించుకునేందుకు, సంపూర్ణ జ్ఞానం సముపార్జించడానికి గ్రంథాలయాలు దోహదపడతాయని అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ వి.సుశీల్‌కుమార్ అన్నారు. 85వ వార్డు అగనంపూడి నిర్వాసితకాలనీ చట్టివానిపాలెం శ్రీకృష్ణ యాదవ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిపూర్ణమైన జ్ఞానాన్ని పొందడానికి గ్రంథాలయాలను వినియోగించుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం ఎంత ఉన్నా, వేలాది మంది నిరుద్యోగులు గ్రంథాలను వినియోగించుకొని పోటీ పరీక్షల్లో సఫలీకృతులవుతున్నారన్నారు. సాంకేతిక పరిజ్ఞానం పెరిగినప్పటికీ గ్రంథాలయాలకు ఆదరణ తగ్గడం లేదన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ నిర్వాహకులు మొల్లి కోటేశ్వరరావు, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మిత్తిపాటి జగదీష్, బి.సత్యనారాయణ, కె.శ్రీనివాసరావు, ఎ.రవికిరణ్, ఈ.వి.అప్పారావు, బి.అప్పలరాజు పాల్గొన్నారు.



వారోత్సవాల ముగింపులో పాల్గొన్న జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుశీల్‌కుమార్

నెహ్రూనగర్ సచివాలయ అడ్మిన్ సెక్రటరీ సస్పెన్షన్

గాజువాక: జీవీఎంసీ గాజువాక జోన్‌లోని 74వ వార్డు నెహ్రూనగర్ సచివాలయ అడ్మిన్ కార్యదర్శి సిరాజల్ హక్‌ను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ గాజువాక జోనల్ కమిషనర్ పి.సింహాచలం ఉత్తర్వులు జారీ చేశారు. హక్‌పై ప్రజల నుంచి అనేక ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయని, ఇతర ఉద్యోగుల విధుల్లో కూడా అతడు కలగజేసుకుని వారికి ఆటంకంగా మారుతుండటంతో ఈ చర్య తీసుకున్నట్టు తెలిపారు. అతడిపై వచ్చిన ఫిర్యాదులపై తగిన విచారణ జరపాలని, జీవీఎంసీ కమిషనర్‌కు నివేదించామని పేర్కొన్నారు.

ఆర్టీఐ ద్వారా రికార్డుల పరిశీలన

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్‌లో రికార్డులను సమాచార హక్కు చట్టం కార్యకర్త పట్టా రామ అప్పారావు, ఉక్కు అధికారి దివంగత నాగ్ర తాతారావు భార్య బంగారమ్మ పరిశీలించారు. విధి నిర్వహణలో మరణించిన నాగ్ర తాతారావు కుటుంబ సభ్యులకు జరిగిన అన్యాయంపై రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి ఫిర్యాదు చేసిన నేపథ్యంలో రికార్డుల పరిశీలనకు ఉక్కు అధికారులు అనుమతించడంతో, సోమవారం వాటిని పరిశీలించారు. వివరాలివి.. స్టీల్‌ప్లాంట్ అసిస్టెంట్ మేనేజర్ నాగ్ర తాతారావు 11 జూలై 2017న విధులకు హాజరయ్యారు. తరువాత ఇంటికి చేరకపోవడంతో కుటుంబ సభ్యులు, యాజమాన్యం పోలీసులకు ఫిర్యాదు చేశారు. నాలుగు రోజుల తరువాత తాతారావు మృతదేహం డ్యూటీ చేసే ప్రాంతం ఆవరణలోనే లభ్యం కావడంతో విధి నిర్వహణలో మృతి చెందినట్లు రికార్డులో నమోదు చేశారు. అయినప్పటికీ మృతుడి కుటుంబసభ్యులకు నష్టపరిహారం, ఉపాధి కల్పించేందుకు యాజమాన్యం అంగీకరించకపోవడంతో రామ అప్పారావు రాష్ట్రపతికి, ప్రధాన మంత్రికి ఇతర ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలో రికార్డులు పరిశీలనకు అనుమతి కోసం దరఖాస్తు చేయడంతో ఉక్కు యాజమాన్యం అంగీకరించడంతో మృతుడి భార్య నాగ్ర బంగారమ్మ, రామ అప్పారావు కర్మాగారం లోపల రికార్డులను పరిశీలించి వివరాలు సేకరించారు.

సరకు రవాణాలో లక్ష్యాలు చేరుకోవాలి

తాటిచెట్లపాలెం(విశాఖ ఉత్తర): సరకు రవాణాలో నిర్దేశించిన గమ్యాలు చేరుకునేందుకు అంతా సమష్టి కృషితో పనిచేయాలని డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్ అన్నారు. దొండపర్తిలోని డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయంలో మంగళవారం అధికారులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శక్తివంతమైన నిర్ణయాలు, ఖర్చు ఆదా చేసే వివిధ పద్ధతులు అనుసరించి గమ్యాలు చేరుకోవాలన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకుని పరిశ్రమలకు అవసరమైన రేక్‌లను సమకూరుస్తూ, త్వరితగతిన డబ్లింగ్ పనులను పూర్తిచేస్తూ వాల్తేర్ డివిజన్ ముందుకు సాగుతోందన్నారు. ప్రత్యేకంగా ముడి ఇనుము సరఫరాకు గతేడాది కంటే సుమారు 25శాతం రేక్‌లను పెంచినట్లు తెలిపారు. సమావేశంలో వాల్తేర్ డివిజన్ వ్యాపార భాగస్వాములైన నేషనల్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎన్‌ఎండీసీ), వైజాగ్ స్టీల్‌ప్లాంట్, గంగవరం పోర్టు, కుద్రేముఖ్ ఐరన్ అండ్ స్టీల్ కంపెనీ, జిందాల్ స్టీల్ సంస్థల నుంచి ప్రతినిధులతో పాటు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ ఆపరేషన్స్ మేనేజర్ జి.సునీల్‌కుమార్, ఆపరేషన్స్, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఆర్‌ఎం సౌరభ్ ప్రసాద్

క్రీడాకారులకు అభినందనలు



క్రీడాకారులను అభినందిస్తున్న కోచ్‌లు మహేష్, శివప్రసాద్

కూర్మన్నపాలెం: కోనసీమ జిల్లా రామచంద్రాపురంలో ఏపీ కెన్యూ ర్యూ కరాటే అధ్యక్షుడు సుమన్ ఆధ్వర్యంలో ఈ నెల 19న జరిగిన 16వ రాష్ట్ర ఇన్విటేషన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో కూర్మన్నపాలేనికి చెందిన క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. మొత్తం 9 జిల్లాల నుంచి క్రీడాకారులు పాల్గొనగా, కూర్మన్నపాలెం రియల్ చాంపియన్‌షిప్ అకాడమీ నుంచా కాటా, కుమిటి ఈవెంట్‌లో వడ్లపూడి ప్రాంతానికి చెందిన గ్రంధి సంపత్ 2 బంగారు పతకాలను సాధించాడు. ఈ సందర్భంగా సంపత్‌ను, ఇతర క్రీడాకారులను కూర్మన్నపాలెం రియల్ చాంపియన్‌షిప్స్ అకాడమీ కోచ్‌లు మహేష్, శివప్రసాద్ అభినందించారు.

మత్స్యకారులను ఆదుకోవాలని కేంద్ర మంత్రికి వినతి

గాజువాక: విశాఖలోని ఫిషింగ్‌హార్బర్‌లో చోటుచేసుకున్న భారీ అగ్నిప్రమాదం వల్ల మత్స్యకారులు తీవ్రంగా నష్టపోయారని కేంద్ర ఫిషరీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సభ్యుడు సిరసపల్లి నూకరాజు తెలిపారు. వారందరికీ పూర్తిస్థాయిలో న్యాయం చేయాలని కోరుతూ కేంద్ర మత్స్యశాఖామంత్రి పర్షోత్తం రూపాలా, ఎల్.మురుగన్‌ను కోరుతూ వినతి పత్రాలు సమర్పించారు. అహ్మదాబాద్‌లో నిర్వహిస్తున్న గ్లోబల్ ఫిషరీస్ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న నూకరాజు ఆ కార్యక్రమానికి హాజరైన కేంద్ర మంత్రులను కలిసి, ఇక్కడ జరిగిన నష్టాన్ని వివరించి, న్యాయం చేయాలని కోరారు. దీనిపై మంత్రులు సానుకూలంగా స్పందించారని నూకరాజు తెలిపారు.

24న మెగా జాబ్‌మేళా

కంచరపాలెం: స్థానిక జిల్లా ఉపాధి కార్యాలయం నేషనల్ కెరీర్ సర్వీస్ సెంటర్‌లో క్లరికల్, టెక్నికల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో ఈ నెల 24న మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఎంప్లాయ్‌మెంట్ అధికారి సీహెచ్ సుబ్బిరెడ్డి (క్లరికల్) ఒక ప్రకటనలో తెలిపారు. హెటిరో డ్రగ్స్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, టీమ్ లీజ్, శరణ్ మోటార్స్, మెడ్ ప్లస్, ఫ్లిప్ కార్ట్, ఆడెక్కో, లాస్య ఇంజినీరింగ్ సొల్యూషన్స్, ఎస్‌వీవీ ఇన్ఫోటెక్, వీల్స్ మార్ట్, వైఎస్‌కే ఇన్ఫోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీల్లో 775 ఖాళీల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారని తెలిపారు. జూనియర్ కెమిస్ట్, ఆఫీసర్, రిటైల్ ట్రైనింగ్ అసోసియేట్, ఫార్మసిస్ట్, జూనియర్ ట్రైనీ, డెవలప్‌మెంట్ ఎగ్జిక్యూటివ్స్, ఫీల్డ్ సేల్స్ ఎగ్జిక్యూటివ్స్, ఆఫీస్ అసిస్టెంట్, అకౌంట్స్, టెలికాలర్, రికవరీ, క్లర్కు, బ్రాంచి ఇన్‌చార్జి, ఎగ్జిక్యూటివ్స్, సీఆర్‌ఈ ఉద్యోగాలకు టెన్త్, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, ఏదైనా డిగ్రీ, పీజీ, ఉత్తీర్ణత సాధించిన 18 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసు కలిగిన పురుష, మహిళా అభ్యర్థులు అర్హులని తెలిపారు. కంచరపాలెం జిల్లా ఉపాధి కార్యాలయంలో శుక్రవారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళాకు రావాలని కోరారు.

ఘనంగా సత్యసాయి యువజన దినోత్సవం

ఉక్కునగరం: సత్యసాయి బాబా 98వ జయంతి వేడుకల్లో భాగంగా మంగళవారం యువజన దినోత్సవం నిర్వహించారు. స్థానిక సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో భాగంగా అగనంపూడి ప్రభుత్వాస్పత్రిలో కొత్తగా పుట్టిన శిశువులకు దుస్తులు, బేబీ ఆయిల్, సబ్బులు, బ్రెడ్, దుప్పట్లు, టవల్స్‌తో కూడిన 25 కిట్లు పంపిణీ చేశారు. అగనంపూడి పునరావాస కాలనీలో పేదలకు ఆహార ప్యాకెట్లు అందజేశారు. నిరుపేద వృద్ధులకు 10 జతల వస్త్రాలు పంపిణీ చేశారు. అంతకు ముందు వేకువజామున మందిరంలో సుప్రభాతం, నగర సంకీర్తన, హనుమాన్ చాలీసా పారాయణం, రుద్రాభిషేకాలు చేశారు. కార్యక్రమంలో సత్యసాయి ప్రతినిధులు జి.రామకృష్ణ, కె.ఎస్.ఎన్. రాజు, వి.కృష్ణ, 15 మంది యువతీయువకులు పాల్గొన్నారు.



అగనంపూడి ఆస్పత్రిలో బాలింతకు బేబీ కిట్ అందిస్తున్న సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు

కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఉక్కునగరం: కాంట్రాక్ట్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఉక్కు గ్రామిక సంఘం నాయకులు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్ట్ లేబర్ సెల్ డీజీఎం గౌరవ్ ఖర్‌ను కోరారు. మంగళవారం వారు ఆయనను కలిసి ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. కాంట్రాక్టర్ చనిపోయిన తర్వాత కార్మికులకు ఫుల్ అండ్ ఫైనల్ చెల్లించక పోవడం వల్ల కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఉక్కు యాజమాన్యమే వారికి నేరుగా చెల్లించేలా చర్యలు తీసుకోవాలన్నారు. నిర్వాసితులకు 50 శాతం ఉపాధి కలిగించి నిరుద్యోగ నిర్వాసితులకు న్యాయం చేయాలన్నారు. దీనిపై ఖర్ సానుకూలంగా స్పందించారని నాయకులు తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు, గౌరవాధ్యక్షుడు కరణం సత్యారావు, అధ్యక్షుడు ఎం. కోటేశ్వరరెడ్డి, బొడ్డు రమణ తదితరులు పాల్గొన్నారు.



స్టీల్‌ప్లాంట్ డీజీఎం గౌరవ్ ఖర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ప్రజా భాగస్వామ్యంతోనే 'ఉక్కు' పరిరక్షణ

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను మానుకోవాలని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెంలో జరుగుతున్న రిలే దీక్షల్లో 1013వ రోజు ఎంఎంఎస్‌ఎం, ఎస్‌టీఎం విభాగ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ప్రజా భాగస్వామ్యంతోనే స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. పోరాట కమిటీ నాయకలు, కార్మికులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న నాయకులు